అధికారుల తీరుపై ఆగ్రహం

తాడూరు: పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహించడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీపీ శివలీల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అసహనం వ్యక్తం చేశారు. మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశాలకు కూడా అధికారులు హాజరుకాకపోతే గ్రామాల్లో సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని సమావేశంలో ప్రశ్నించారు. విధులకు ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి ఉందని ఎంపీటీసీలు రమేశ్‌రెడ్డి, సుశీల, సర్పంచ్‌లు రమణ, నిరంజన్ సభ దృష్టికి తీసుకెళ్లారు. మండల కేంద్రంలో 2 వసతిగృహాలు ఉన్నా వార్డెన్లు మాత్రం ఒక్క సమావేశానికి రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారి పూర్తిగా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని వివరించారు. సమావేశాలకు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లా స్థాయి అధికారులకు వీరిపై ఫిర్యాదు చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. అంతకుముందు హాజరైన అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం మండల సభను ఎంపీడీఓ గంగామోహన్ ముగించారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ ఎండీ సమ్మద్ పాషా, ఆయా శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ శివలీల

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

వెల్దండ: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని అజిలాపూర్‌లో రూ.5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అదే విధంగా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోషమ్మ దేవాలయ నిర్మాణానికి రూ.51 వేలు విరాళంగా అందజేశారు. సొంతఖర్చులతో గ్రామంలో రూ.16 వేలు వెచ్చించి విద్యుత్ స్తంభాలను అందించామన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు అసత్యప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రమేష్‌గౌడ్, నాయకులు కుమార్, వెంకటేష్, శేఖర్, యాదగిరి, శ్రీకాంత్, బుచ్చయ్య, జాఫర్, అంజయ్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్

క్లుప్తంగా

రైతుబీమాకు 5వ తేదీ వరకు గడువు

అమ్రాబాద్/ఉప్పునుంతల: పదర మండల రైతులు ఆగస్టు 5వ తేదీ లోగా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని పదర, ఉప్పునుంతల ఏఓలు రమేష్, సునీత మంగళవారం వేర్వేరుగా ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు అర్హులని రైతులు పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను సంబంధిత ఏఈఓకు అందజేయాలని పేర్కొన్నారు.

'దళితబంధు'లో మాలలకు అన్యాయం

మన్ననూర్: దళితబంధు పథకం అమలులో మాలలకు అన్యాయం చేస్తున్నారని మాల మహానాడు జిల్లా నాయకుడు మద్దెల దివాకర్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి విడతలో దళిత బంధు 80 శాతం మాదిగ కులస్తులకే కేటాయించారని ఇది ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. మాలలపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి రెండో విడతలోనైనా మాలలకు న్యాయం చేయాలని లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. సమానవాటా ఇచ్చే వరకు పోరాడుతామన్నారు. సమావేశంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం

కల్వకుర్తి: మండల కేంద్రంలో డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శంకరయ్యను మంగళవారం మాల మహనాడు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రావుల శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు నరేందర్, మహిళా సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి భారతి, పట్టణ మహిళా సంఘం కార్యదర్శి మణెమ్మ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

వెల్దండ: మండలంలోని పిల్లికండ్లతండా చెందిన రాత్లావత్ గోజి మంగళవారం గుండెపోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సింగిల్‌విండో డైరెక్టర్ సంజీవ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు కాదురామ్‌నాయక్, అలీ, రవీందర్‌నాయక్, అరుణ్‌నాయక్, భీమ్‌సింగ్, మహిపాల్, బిచ్చ తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన రైతులు

అమ్రాబాద్: మండలంలోని పొడలక్ష్మి గోవుల సంఘం సభ్యులు మంగళవారం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను హైదరాబాద్‌లో కలిశారు. తెలంగాణ పశువుగా గుర్తింపు పొందిన పొడజాతి పశువుల అభివృద్ధి, సంరక్షణ కోసం ప్రభుత్వం తరపున సహకారం అందించాలని వారు మంత్రిని కోరారు. గతంలో మాదిరిగా అటవీశాఖ అధికారుల అభ్యంతరం లేకుండా అడవిలో మేపుకునేందుకు వీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పొడజాతి పశువులకు బీమా సౌకర్యం, వైద్య సదుపాయంతోపాటు ఉచితంగా పశువుల దాణా అందించాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో గోవు సంఘం అధ్యక్షుడు హనుమంతు, సభ్యులు జయరాం, లింగయ్య పాల్గొన్నారు.

ముదురుతున్న 'సహారా' వివాదం



మన్ననూర్: ప్రజల వద్ద పొదుపు పేరుతో సహారా ఇండియా ఫైనాన్స్ కంపెనీ పేదల నుంచి రూ.లక్షల్లో స్కీంలు, డిపాజిట్లు చేయించుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో సంస్థకు సంబంధించిన ఏజెంట్లు నెల, ఏడాది ప్రీమియం చొప్పున లక్షల్లో డిపాజిట్లు చేయించారు. కాల పరిమితి పూర్తైనా డిపాజిట్‌దారులకు డబ్బులు ఇవ్వడం లేదు. రెండు, మూడు సంవత్సరాలుగా డిపాజిట్ మొత్తం నగదు జమ కోసం ఖాతాదారులు ఎదురుచూస్తున్నారు. ఏజెంట్లు నిలదీస్తే కంపెనీఎత్తివేసినట్లు సమాచారం ఇచ్చారు. దీంతో బాధితులు మన్ననూర్‌లోని ఏజెంట్ల ఇళ్లను ముట్టడించి తాళం వేసి నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బాధితులకు శాంతింపజేశారు. న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

జనసేన బలోపేతానికి కృషి

కోడేరు: జనసేన బలోపేతానికి కృషి చేద్దామని కొల్లాపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బైరపోగు సాంబశివుడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జనసేన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పోలోజు రాఘవేంద్రచారి, ఉపాధ్యక్షుడిగా ఎండీ జహంగీర్, నారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎండీ పాషా ఎన్నికయ్యారు.

రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్‌గా నిరంజన్



తెలకపల్లి: మండలంలోని బొప్పల్లి గ్రామానికి చెందిన నిరంజన్ మంగళవారం రియల్ ఎస్టేట్ సంక్షేమ సంఘం రాష్ట్ర చీఫ్ కో ఆర్డినేటర్‌గా నియామకం అయ్యారు. అదే విధంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు అప్పగించిన శ్రీకాంత్‌కు నిరంజన్ కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై నిరసన



బల్మూరులో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్యకర్తలు



లింగాలలో..

బల్మూర్: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీపై మంత్రి కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. మండల కేంద్రంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ స్థాయికి మించి మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో రాంప్రసాద్, చంద్రమౌళి, సాయి, వెంకటయ్య, ఖదీర్, నిమ్మల విష్ణు, బీక్యానాయక్, కొండల్, మహేష్, రఘుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగాల: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏకలవ్య విగ్రహం ఎదుట మంత్రి కేటీఆర్‌ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్, నాయకులు లక్ష్మణ్‌నాయక్, పూజారి వెంకటయ్య, మల్లయ్య, ముక్తార్, రాజల్, అశోక్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జున సాగర్ బహుళార్ధక, శాశ్వత ప్రాజెక్టులను నిర్మించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, తిర్పతయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

పెద్దకొత్తపల్లి: మండలంలో ఎస్‌ఐగా పనిచేస్తున్న రాము యాదవ్ బిజినేపల్లికి బదిలీ అయ్యారు. మంగళవారం సీఎంఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ యాలాద్రి, ఎస్‌ఐలు రసన్మానించారు. రాము యాదవ్‌కు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ యాలాద్రి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ సాధారణమని ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసినప్పుడే తృప్తి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో



ఎస్‌ఐలు రాజుయాదవ్, బాలవెంకట్, ఎంపీటీసీలు రేణుకానాగరాజు, రాంచంద్రయ్య, ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, ఇందిరా, రవి నాయక్, రాజేందర్‌గౌడ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాగరాజు, రవినాయక్, రమేశ్, పాల్గొన్నారు.

గడపగడపకూ బీజేపీ

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపూర్‌లో మంగళవారం బీజేపీ గడపగడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎల్లేని సుధాకర్‌రావుకు అండగా నిలవాలని కోరారు. వెంకటస్వామి, ఖలీల్, మూలె వెంకటేష్, శ్రీహరి, పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయి కృష్ణగౌడ్, నాయకులు ఉన్నారు.



గోపులాపూర్ ప్రచారం చేస్తున్న నాయకులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని మారేడుమాన్‌దిన్నె, వేడుకరావుపల్లి, చంద్రబండ తండాలలో గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి రోజా రమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా నాయకురాలు విజయలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

అచ్చంపేట రూరల్: పట్టణంలోని 11వ వార్డు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేశారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వెంకటేష్, సారంగిరాజు, హరీష్, సురేష్ ఉన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పులిజాలలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నిర్వహించిన రైతు నిరసనలో ఆయన పాల్గొన్నారు. రైతులకు మూడు గంటల విద్యుత్ కావాలా లేక 24 గంటల విద్యుత్ కావాలో నిర్ణయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అరుణ, మండల అధ్యక్షుడు పర్వతాలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల

నులిపురుగుల నివారణే లక్ష్యం



ఉప్పునుంతల: నులిపురుగుల నివారణే ప్రభుత్వ లక్ష్యమని వైద్యాధికారిణి స్వప్న అన్నారు. 20న మండలంలో నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు, అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ నిర్వహించారు. 1- 19 ఏళ్ల వయస్సు లోపు బాలబాలికలకు ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్ర వేయాలని సూచించారు. మండలంలో మొత్తం 3530 మంది పిల్లలకు మాత్రలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఫార్మసిస్టు శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రభావతి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపార్టీలో చేరిక



పెద్దకొత్తపల్లి: మండలంలోని గంట్రావుపల్లిలో ప్రజాపార్టీ కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ హాజరయ్యారు. వివిధ పార్టీలకు చెందిన 30 మంది కార్యకర్తలు ప్రజాపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం దాసరి అజయ్‌కుమార్ మాట్లాడుతూ బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్ యాదవ్, వెంకటస్వామి, బాలస్వామి, రాము, శ్రీకాంత్, మల్లేష్, కుర్మయ్య, చంద్రయ్యలు పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ



కొల్లాపూర్ రూరల్: మండలంలో సింగోటంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ప్రజాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ ఉచితంగా బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మొత్తం 100 బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన వృద్ధుడు చెన్నయ్య గౌడ్(60) అదృశ్యంపై మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ రమేశ్ వివరాల ప్రకారం ఈ నెల 14వ తేదీన పనినిమిత్తం కల్వకుర్తికి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువుల, స్నేహితుల ఇళ్ల వద్ద వాకబు చేసినా ఫలితం దక్కలేదు. వృద్ధుడి కుమారుడు నాగేందర్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియకుండా బయటకు వెళ్తున్న ఎస్‌ఓ పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పాఠశాల హాస్టల్ ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ, బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎస్‌ఓ తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తరుణ్, ప్రవీణ్, వెంకటేష్, ఖలీల్, వెంకటస్వామి, శ్రీహరి, చందులు పాల్గొన్నారు.

మహిళా సమైక్య మండల కమిటీ వాయిదా

కల్వకుర్తిరూరల్: మహిళా సమైక్య నూతన మండల కమిటీ ఎన్నిక మంగళవారం వాయిదా పడింది. మండలంలోని 20 మంది గ్రామ అధ్యక్షురాళ్లను ఆహ్వానించి, ప్రజాప్రతినిధులకు ఆహ్వానం పంపలేదని ఎంపీపీ మనోహర ఆగ్రహం వ్యక్తం చేయడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. మహిళా సమైక్య పదవీకాలం ముగిసి చాలా సంవత్సరాలైన సందర్భంగా నూతన కమిటీ ఎన్నికకు ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఏపీఎం, సీసీ, డీఎంజీ హాజరయ్యారు. ప్రజాప్రతినిధులకు ఆహ్వానం లేని కారణంగా సమావేశం వాయిదా వేసినట్లు ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. మరోసారి అందరి సమక్షంలో నిర్వహిస్తామని తెలిపారు. మహిళా సమైక్య మండల కమిటీ ఎన్నికపై ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం గాంధీ పార్కులోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు షర్పొద్దీన్ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 160 స్కూల్‌స్వీపర్లు రూ.1,623 తక్కువ వేతనంతో బతుకుబండి లాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల ప్రారంభం నుంచి సాయంత్రం వరకు పారిశుద్ధ్య పనులు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం శ్రమదోపిడీ లేకుండా ప్రభుత్వం రూ.27 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పొదిల రామయ్య, జిల్లా అధ్యక్షుడు యాదగిరిగౌడ్, వెంకటయ్య గౌడ్, బాలస్వామి, సలీం, నర్సింహ పాల్గొన్నారు.

అర్హులందరికీ పట్టాలు ఇవ్వాలి



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 22, 27లో గల 14 ఎకరాల భూమిలో గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం నుంచి కొల్లాపూర్ ఆర్డీఓ కార్యాలయం వరకు ప్రజా సంఘాల నాయకులు 200 మంది పాదయాత్రగా వెళ్లారు. పేదలకు పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోం

బిజినేపల్లి: ఇష్టానుసారంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు గంగనమోని తిరుపతయ్య బీఆర్‌ఎస్ నాయకులను హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసభ్య పదజాలంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి విమర్శించడం సరికాదన్నారు. స్థాయికి తగ్గ మాట్లాడితే మంచిదని సూచించారు. మరోమారు పునరావృత్తం అయితే సహించమన్నారు. అభివృద్ధి, అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని వట్టెం సర్పంచ్ అమృతరెడ్డి సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఏద్దుల రాములు, పరశురాములు, కే.తిరుపతయ్య, వెంకటస్వామి, బాలరాజు, హరీష్‌రెడ్డి, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించాలని పాదయాత్ర

బల్మూర్: అచ్చంపేట నియోజవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు నిర్మించాలని కోరుతూ మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో మండలంలోని సీతారాంపూర్ నుంచి తెల్జిరిగుడిసెలు వరకు పాదయాత్ర చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సతీష్ మాదిగ మాట్లాడుతూ గ్రామాల్లో కనీస వసతులు కల్పించని అసమర్థ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అని విమర్శించారు. ఎమ్మెల్యేగా పదేళ్లు గడిచినా రోడ్లు నిర్మించకపోవడం దారుణమన్నారు. బల్మూర్ మండలంలోని సీతారాంపూర్ నుంచి తోడెళ్లగడ్డ, తెల్జిరి గుడిసెలు బాణాల వరకు బీటీ రోడ్డు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్‌అండ్‌బీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. పాదయాత్ర అనంతరం సీతారాంపూర్ వద్ద అచ్చంపేట-బల్మూర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పెద్దయ్య, నాయకులు మండికారి బాలాజీ, సర్పంచ్ రమేష్‌యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మారెడ్డి సేవలు మరువలేనివి

కల్వకుర్తిరూరల్: దివంగత లక్ష్మారెడ్డి సేవలు మరువలేనివని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం అన్నారు. మంగళవారం మండలంలోని మార్చాలలో పేదల పెన్నిధి సంస్థ వ్యవస్థాపకుడు రిటైర్డ్ ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డి సంతాప సభ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ హాజరై మాట్లాడారు. పేదల కోసం సామాజికసేవ కార్యక్రమాలు నిర్వహించిన గొప్ప వ్యక్తి లక్ష్మారెడ్డి అని కొనియాడారు. అనంతరం మహిళలకు, వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. మల్లయ్య, కృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి



నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడించిన పంచాయతీ కార్మికులు



కల్వకుర్తిలో



అచ్చంపేటలో.



కొల్లాపూర్‌లో

నాగర్‌కర్నూల్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలంటూ కోరుతూ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్ష మంగళవారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. నిరసనలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించి గేటుకు వినతిపత్రాన్ని అంటించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు వారికి సంఘీభావం తెలిపారు. ఈ నెల 21న చలో కలెక్టరేట్ నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ సహాయ కార్యదర్శి రామయ్య, కోశాధికారి కొంపల్లి అశోక్, ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న, గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు రాములు, కతాల్, కుర్మయ్య, రాజు, రాము, మంగమ్మ,తిరుపతమ్మ, బాలస్వామి, అలివేల, తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పంచాయతీ కార్మికుల సమ్మెను ప్రభుత్వం ఏమాత్రం స్పందించడలేదని నిరసిస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడే బైఠాయించి ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్ సంఘీభావం తెలిపారు. అనంతరం కార్మికులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే పీఏకు అందజేశారు.

కల్వకుర్తిరూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు పంచాయతీ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మద్దతు తెలిపారు. శుక్రవారం చలో కలెక్టరేట్ నిర్వహిస్తామన్నారు.

కొల్లాపూర్: పట్టణంలో పంచాయతీ కార్మికులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఎంపీపీ బోజ్యానాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ నరేందర్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారి హనుమనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు ఈశ్వర్, నర్సింహ్మా, శివవర్మ, శ్రీనివాసులు, బాలపీరు తదితరులున్నారు.

తాడూరు: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో ఎంపీఓ లక్ష్మణ్ నాయక్‌కు పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. వారి డిమాండ్లను వివరించారు. కార్యక్రమంలో కార్మికులు బాలస్వామి, కైరత్, సుబ్బయ్య, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో పేరుకుపోయిన చెత్తను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ట్రాక్టర్ ద్వార చెత్తను తొలగించేందుకు ప్రయత్నిస్తుండగా కార్మికులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. తుమ్మ మహేష్, సైదులు, వెంకటయ్య, కేశవులు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..

ఉప్పునుంతల: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి సమక్షంలో చేరారు. మంగళవారం మండల కేంద్రంలో వారికి పార్టీ కాండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మదనాగుల తిర్పతయ్య, జహంగీర్, శ్రీను, అంతటి కృష్ణయ్యగౌడ్, గోపయ్య, వెంకటయ్య, బాలయ్య, చెన్నయ్య తదితరులు ఉన్నారు.